క్లుప్తంగా

మూగ జీవాలను రక్షించుకోవాలి

రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



గొర్రెలకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

షాబాద్: వ్యాధుల నుంచి మూగ జీవాలను రక్షించుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మక్తగూడ గ్రామంలో గొర్రెలకు, మేకలకు పారుడు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గ్రామాల్లో పారుడు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. జీవాలకు రోగాలు ప్రబలిన వెంటనే పశువైద్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని కోరారు. జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి



సత్తయ్య (ఫైల్)

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో ఓ హోంగార్డు మృతి చెందిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోచారం సమీపంలో సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం..కందుకూరు మండలం కొలన్‌గూడకు చెందిన ఎ. సత్తయ్య (50) హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్నాడు. డ్యూటీకి బైక్‌పై వెళ్తున్న క్రమంలో పోచారం సమీపంలో లారీ ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ అతివేగం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

వికారాబాద్ అర్బన్: ఫాం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న 80 సంవత్సరాల వయోవృద్ధులు, 40 శాతం కన్నా ఎక్కువ అంగవైకల్యం ఉన్న వికలాంగులు తమ ఓటు హక్కును ఈ నెల 23న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వినియోగించుకోవాలని ఎన్నికల రిటరి్నంగ్ అధికారి రాహుల్ శర్మ కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు. ఓటర్ల ఇంటి వద్దకే పోలింగ్ అధికారులు వచ్చి, బ్యాలెట్ పత్రాలను అందజేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అత్యవసర సేవలు అందించే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును 24 నుంచి 26 వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వికారాబాద్ రిటరి్నంగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లో వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలింగ్ అధికారులు.. పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లో నేటి నుంచి నుంచి 24 వరకు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు తమ ఓటును 27 నుంచి 29 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రిటరి్నంగ్ అధికారి కార్యాలయంలో వేయాలని రాహుల్ సూచించారు.

రేపటి నుంచి అనంత పద్మనాభుడి జాతర

ఏర్పాట్లు ముమ్మరం చేసిన అధికారులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణానికి సమీపంలోని అనంతగిరి గుట్టలో వెలసిన అనంత పద్మనాభ స్వామివారి కార్తీకమాస పెద్ద జాతర రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఈ వేడుకలు డిసెంబర్ 7వరకు జరగనున్నాయని ఆలయ ధర్మకర్త ఎస్.పద్మనాభం, ఈఓ నరేందర్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 4 గంటలకు ధ్వజారోహనంతో ప్రారంభం కానుంది. 23న కార్తీక ఏకాదశి ఉత్సవం, 24న రాత్రి 7 గంటలకు తులసి వివాహం జరగనుంది. 27న పౌర్ణమిని పురస్కరించుకుని సాయంత్రం 6.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, రాత్రి 9.30 గంటలకు రథోత్సవం ఉంటుందని తెలిపారు. 28న ఉదయం 11గంటలకు గరుడ వాహన సేవ, 29న ఉదయం 11గంటలకు ముత్యాల పందిరి వాహనసేవ, 30న ఉదయం 11 గంటలకు గజ వాహనోత్సవం నిర్వహించనున్నారు. డిసెంబర్ 7న ఉదయం 11గంటలకు చక్రతీర్థంతో వేడుకలు ముగియనున్నాయని వారు వెల్లడించారు. యేటా కార్తిక మాసంలో 15రో జుల పాటు జాతర జరుగుతుందని, ఉత్సవాలకు రాష్ట్ర నలుమూల నుంచే కాకుండా, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు రానున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

అభివృద్ధిని దూరం చేసుకోవద్దు



ప్రచారంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి, తదితరులు



మొయినాబాద్: ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

- చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి
- చరిత్ర తెలుసుకొని ఓటు వేయాలి
- ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అమలుకాని హామీలను నమ్మి ఆగం కావద్దని చేవెళ్ల నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య ఓటర్లను కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కారు గుర్తుకు ఓటు వేసి మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి నేర చరిత్ర కలిగిన వాడని ఆరోపించారు. చేవెళ్ల బీజేపీ అభ్యర్థి తమకు అసలు పోటీనే కాదన్నారు. నియోజకవర్గం నాయకులు దేశమొళ్ల అంజనేయులు ఆధ్వర్యంలో షాబాద్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బాల్‌రాజ్, ప్రభాకర్, క్రిష్ణారెడ్డి, రమణారెడ్డి, యాదగిరి, చంద్రశేఖర్, శివప్రసాద్, అలీ, రహీమాబేగం, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అంజయ్య, వెంకటేశ్, శ్రీరాంరెడ్డి, రాములు, సత్తయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శివానందం, కుంచం శివకుమార్, వెంకటేశంగుప్తా, శివారెడ్డి, సత్తి, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మిషన్ భగీరథతో నీటి గోస తీరింది

మొయినాబాద్: తెలంగాణ రాక ముందు గ్రామాల్లో తాగునీటి కోసం మహిళలు బిందెలు పట్టుకుని తిరిగేవాళ్లని.. సీఎం కేసీఆర్ మిషన్ భగీరథతో నీటి గోస తీరిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని పెద్దమంగళారం, సురంగల్ గ్రామాల్లో ఆయన సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికి నల్లా నీళ్లు, 24 గంటల కరెంటు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు చెప్పే మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి తనను మూడోసారి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ రవుఫ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహ్మాగౌడ్, సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీలు శ్రీనివాస్, మల్లేష్, నాయకులు జైపాల్‌రెడ్డి, నాగరాజు, సంజీవరావు, అంజిరెడ్డి, భాస్కరాచారి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి కాలె యాదయ్య విజయం తథ్యం

శంకర్‌పల్లి: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య మూడోసారి విజయం సాధించడం ఖాయమని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, జెడ్పీటీసీ కాలె జయమ్మ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో యాదయ్యను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాకే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనాథ్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్‌ఖన్నా, నాయకులు సాత ప్రవీణ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రుద్రాభిషేకం

అనంతగిరి: వికారాబాద్ పట్టణం కొత్తగడి వీరాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల దంపతులు పూజ చేశారు. స్వామి వారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకం చేశారు. అనంతరం స్వామికి నైవేద్యం సమర్పి ంచి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో సోమవారం స్టేట్ టీచర్స్ యూనియన్ షాద్‌నగర్ డివిజన్ శాఖ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో.. ఎస్టీయూ ఫరూఖ్‌నగర్ మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా నారాయణ(జెడ్పీహెచ్ఎస్, బూర్గుల), ప్రధాన కార్యదర్శిగా సతీష్ (జెడ్పీహెచ్ఎస్, కుంట), జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా శంకర్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఫరూఖ్‌నగర్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎస్టీయూ నాయకులు

లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్, జియో ఫైబర్ సంస్థ ప్రతినిధులు



సీపీఆర్‌పై డెమో చూపిస్తున్న డాక్టర్ ఉషారాణి, కాంచన

ప్రిన్సిపాల్ కాంచన లత

చేవెళ్ల: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు ధన్వంతరి ట్రస్ట్, జియో ఫైబర్ కంపెనీల ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీయర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ.. గుండెపోటు సంభవించినప్పుడు చేపట్టే సీపీఆర్‌పై అవగాహన కలి్పంచారు. అనంతరం ప్రిన్సిపాల్ కాంచనలత మాట్లాడుతూ.. డిగ్రీ చదువుతునే విద్యార్థులు ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించవచ్చునని తెలిపారు. జియో ఫైబర్ కంపెనీలో విద్యార్థులు పార్ట్ టైంగా ఉపాధి పొందే అవకాశాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువులో వెనకబడిన విద్యార్థులకు పాఠశాలలో కనీస అవగాహన కల్పించి వారిని చదువులో చురుకుగా ఉండేలా తీర్చిదిద్దెందుకు కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు 'పిల్లల కోసం' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా 73 మంది విద్యార్థులు దీనిపై శిక్షణ పొందినట్లు చెప్పారు. వీరిలో 41 మంది విద్యార్థులను వివిధ పాఠశాలలకు కేటాయించడం జరిగిందన్నారు. దీనికోసం విద్యార్థులు ముందుకు వచ్చి శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. పాఠశాలలో చదువులో రాయటం, చదవడం రాని విద్యార్థులను సూపర్ 15గా గుర్తించి వారిలో విషయ పరిజ్ఞానం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఒక సమాజిక సేవ కార్యక్రమంగా తీసుకుంటున్నట్లు చెప్పారు. సామాజిక సేవా దృక్పదాన్ని అభివృద్ధి చేయడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ ఎన్. జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. సోమవారం మండలంలోని తోల్‌కట్ట సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ నెల 18న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 67వ ఎస్‌జీఎఫ్ రంగారెడ్డి జిల్లా లెవల్ టోర్నమెంట్, కామన్ సెలక్షన్స్ 2023–24 నిర్వహించారు. ఈ పోటీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో లాంగ్ జంప్ అండర్–17 విభాగంలో రక్షిత(8వ తరగతి) 3వ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. అలాగే, అండర్–14 విభాగంలో ఎస్.వైష్ణవి(7వ తరగతి) అథ్లెటిక్స్ 100, 200 మీటర్ల విభాగంలో 2వ స్థానంలో వెండి పతకం సాధించగా లాంగ్ జంప్‌లో రెండవ స్థానంలో నిలిచింది. గెలుపొందిన రక్షిత, వైష్ణవిలను రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రమాదేవి

కార్మికుల సమస్యలు పట్టని బీఆర్‌ఎస్

టంగుటూరి నర్సింహారెడ్డి



కార్మికులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కొందుర్గు: గ్రామ పంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని పలుమార్లు ధర్నాలు, నిరసనలు చేసిన అధికార బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో అందరు కాంగ్రెస్ పార్టీకి ఓటు చేయాలని సూచించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తేనే మన కష్టాలు తీరుతాయని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి సూచించారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల గ్రామ పంచాయతీ కార్మికులతో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాలను కార్మికులకు వర్తించేలా కృషి చేస్తామన్నారు. వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: బీఆర్‌ఎస్ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని చింతగూడ, చౌడమ్మ గుట్ట తండా గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అవినీతి, అక్రమాలకు తావివ్వకుండా సుపరిపాలన చేస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను ప్రజలు నమ్మరని అన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. నిరుపేదల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్‌కు ప్రజలందరు అండగా నిలవాలని, రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

ట్రాక్టర్ కింద పడి కార్మికుడు మృతి

మర్పల్లి: ప్రమాదవశాత్తు పారిశుద్ధ్య కాంట్రాక్ట్ (దినసరి కూలి) కార్మికుడు ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పిట్టల హరిప్రసాద్(65) నాలుగు నెలలుగా మర్పల్లి గ్రామ పంచాయతీలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. విధినిర్వహణలో భాగంగా రైల్వే స్టేషన్ ఎదుట ఆర్‌అండ్‌బీ రోడ్డులో హరిత హారం మొక్కలకు నీరు పట్టేందుకు జీపీ ట్రాక్టర్లో వెళ్తున్న క్రమంలో.. డ్రైవర్ మైపాల్ అజాగ్రత్త వలన ట్రాక్టర్‌పై కూర్చున్న హరిప్రసాద్.. కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ హరిప్రసాద్ మృతి చెందాడు. మృతుడి భార్య జోగాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీజేపీతోనే సుపరిపాలన



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

అనంతగిరి: బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం వికారాబాద్ మున్సిపల్ పరిధి గిరిగేట్‌పల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సదానంద రెడ్డి మాట్లాడారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, కావున కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థి నవీన్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

'పట్నం' గడ్డ మంచిరెడ్డి అడ్డా

ఇబ్రహీంపట్నంరూరల్: ఇబ్రహీంపట్నం గడ్డా బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అడ్డా అని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలి్మనేడు, మెటిల్లా గ్రామాల్లో కృపేష్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహాడ్ గ్రామంలో ఎమ్మెల్యే కుమార్తె శీతల్ ప్రచారం నిర్వహించారు. అభివృద్ధికి మారు పేరైన మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కప్పపహాడ్ సర్పంచ్ హంసమ్మ, ఎంపీటీసీ భరత్‌రెడ్డి, ఉప సర్పంచ్ మునీర్, నిట్టు జగదీశ్వర్, ఎలి్మనేడులో ఎంపీపటేల్‌గూడ పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచిరెడ్డి మౌనిక ప్రచారం

మంచాల: మండల పరిధిలోని చిత్తాపూర్ గ్రామంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోడలు మంచిరెడ్డి మౌనిక సోమవారం ఉదయం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి కిషన్‌రెడ్డి చేసిన కృషిని గుర్తించి మరోసారి ఎమ్మెల్యేగా అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆమెతో పాటు మంచాల ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, సర్పంచ్ బొడ్డు నాగరాజ్ గౌడ్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన జుట్టు శ్రీశైలం

యాచారం: బీజేపీ రాష్ట్ర నాయకుడు జుట్టు శ్రీశైలం సోమవారం కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు. శ్రీశైలంతో పాటు పలువురు కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించిన పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఇంటింటి ప్రచారం

ఇబ్రహీంపట్నం: మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఇబ్రహీంపట్నం 1వ వార్డు, 158 పోలింగ్ బూత్ పరిధిలో సోమవారం బూత్ ఇన్‌చార్జి కంచకట్ల భాస్కర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు గడప గడపకూ వెళ్లి ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్, కిషన్‌రెడ్డి ఇబ్రహీంపట్నంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ.. మంచిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

సీబీఆర్‌ఎన్ నిర్వహణపై శిక్షణ

శంషాబాద్: కెమికల్, బయోలాజికల్, రెడియాలాజికల్, న్యూక్లియర్ (సీబీఆర్‌ఎన్) అత్యవసర నిర్వహణ శిక్షణ కార్యక్రమాన్ని జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్, నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సంయుక్తంగా ప్రారంభించింది. సోమవారం ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమం ఈనెల 24 కొనసాగనుంది. అత్యవసర పరిస్థితుల్లో ఎయిర్‌పోర్టు ఎమర్జెన్సీ హ్యాండ్లర్లు సంసిద్ధతతో స్పందించే విధానంతో పాటు ఎయిర్‌పోర్టులో సీబీఆర్‌ఎన్ ద్వారా కలిగే ముప్పులను ముందస్తుగా అరికట్టడం, ఎదుర్కొనే విధానంపై చర్చించారు. ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్‌ఫణీకర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీబీఆర్‌ఎన్ శిక్షణ పొందిన నిపుణుల సేవలు ఎంతో అవసరమన్నారు. అర్హత సాధించిన వారికి సర్టిఫికెట్లను అందజేయనున్నారు. వివిధ జాతీయ రక్షణ సంస్థలు పాల్గొన్నాయి.

